క్లుప్తంగా

గుమ్మ సర్పంచ్ స్థానానికి నేడే పోలింగ్

కురుపాం: మండలంలోని గుమ్మ పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. గుమ్మ పంచాయతీ కేంద్రంలోని ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో రెండు గదులను పోలింగ్‌కు కేటాయించారు. సర్పంచ్ బరిలో నలుగురు అభ్యర్థులు పోటీలో ఉండగా.. వారిలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ బలపరిచిన అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. పంచాయతీ పరిధిలోని 8 గిరిజన గ్రామాలకు చెందిన 1202 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టి సాయంత్రం ఫలితాలు వెల్లడించనున్నారు.

ప్రశాంత పోలింగ్‌కు సహకరించండి

జియ్యమ్మవలస: మండలంలోని కొండచిలకాం 4వ వార్డు మెంబర్ ఎన్నికకు శనివారం ఉప ఎన్నిక జరగనున్నందున పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా గ్రామస్తులు సహకరించాలని ఎస్సై అనీష్ కోరారు. గొడవలు జరగకుండా ఇరు వర్గాలకు చెందిన 22 మందిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించాలి



ఎంపీపీ శాంతికుమారికి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: స్థానిక సచివాలయంలో పూర్తిస్థాయి కార్యదర్శి విధుల్లో లేకపోవడంతో గ్రామ వలంటీర్లకు వేతనాలు సక్రమంగా అందడం లేదని వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ రొక్కం రమేష్, మాజీ సర్పంచ్ పోతల మజ్జి, వార్డు సభ్యుడు పోతల చంద్రభూషణ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీపీ తోట శాంతి కుమారి, ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలంకు ఫిర్యాదు చేశారు. స్థానిక సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఆధార్ కేంద్రంకు శిక్షణ పొందిన డీఏ లేకపోవడంతో ఆధార్ అప్‌డేషన్ కావడం లేదన్నారు. తాలాడ సర్పంచ్ ఎరుకుమజ్జి ప్రభావతి ఉన్నారు.

ఏసీటీ కిట్ల వితరణ



ఆరోగ్య కార్యకర్తలకు ఏసీటీ కిట్లు అందజేస్తున్న ప్రభాకరరావు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ వైద్యాధికారి జి.ప్రభాకరరావు తాడికొండ పీహెచ్‌సీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకర్తలకు ఏసీటీ కిట్లను శుక్రవారం వితరణ చేశారు. గ్రామాల్లో మలేరియా కేసులు నమోదవుతుండటంతో మలేరియా పాజిటివ్ వచ్చిన వారికి ఈ టాబ్లెట్లను అందజేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

విద్యుత్ సమస్యలు అధిగమించేందుకు చర్యలు



సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు పర్యవేక్షిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు అధిగమించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులకు గురైన ఏబీ స్విచ్‌లు, అనుసంధాన పరికరాలు, కండక్టర్లను శుక్రవారం శుభ్రం చేశారు. అవసరమైన చోట కొత్త పరికరాలను అమర్చారు. ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి, డీఈఈ మోహన్‌చక్రవర్తి, ఏఈ శ్యాంసుందర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ కేశవరావు తదితరులు పనులను పర్యవేక్షించారు.

గిరిజనుల శ్రమదానం

సీతంపేట: పూతికవలస పంచాయతీ పరిధిలో ఎత్తైన కొండలపై ఉన్న రంగంవలసకు సరైన రహదారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి రోడ్డు నిర్మించాలని పలుమార్లు అధికారులను కోరారు. రోడ్డు మంజూరైనంత వరకు రాకపోకలకు వీలుగా తాత్కాలిక రహదారిని నిర్మించుకునేందుకు సిద్ధమయ్యారు. రోడ్డు పనుల్లో గ్రామస్తులంతా చురుగ్గా పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టు

పాలకొండ రూరల్: పాలకొండ–పార్వతీపురం రహదారి తుమరాడ వద్ద భారీ వర్షానికి శుక్రవారం సాయంత్రం ఓ చెట్టు నేలకొరిగింది. దీంతో రోడ్డుకు ఇరువైపుల ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తుల సహకారంతో నేలకొరిగిన చెట్టును తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



గరుగుబిల్లి: కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



సీతంపేట: సంతోషిమాత ఆలయంలో శ్రావణమాస పూజలు చేస్తున్న భక్తులు

సీతంపేట: స్థానిక సంతోషిమాత ఆలయంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేమకోటి సాయికృష్ణశర్మ మంత్రోచ్చరణల మధ్య భక్తులు సామూహిక లలితా సహస్రనామ సహిత కుంకుమార్చనలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిలాడింది.

- వీరఘట్టం: స్థానిక కోటదుర్గమ్మ, పైడితల్లి అమ్మవారి ఆలయాల్లో యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమపూజలు చేశారు. అదేవిధంగా కంబర, కడకెల్ల, వండవ, బిటివాడ, తలవరం, సంత–నర్సిపురం, తెట్టంగి, నీలానగరం, పనసనందివాడ గ్రామాల్లో మహిళలు శ్రావణ లక్ష్మీ పూజలు చేసి ఉపవాసదీక్షలు ఆచరించారు.
- గరుగుబిల్లి: రావివలస సంతోషిమాత ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సెప్టెంబర్ 15వరకు ఆలయంలో శ్రావణమాస పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు వెంకట లక్ష్మీనరసింహ మూర్తిశర్మ తెలిపారు. 25న వరలక్ష్మీ వ్రతం, 31న అమ్మవారికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

కొమరాడ: కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉద్యోగులు కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక జూనియర్ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు సీఎం చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు.

కార్యక్రమంలో అధ్యాపకులు పి.అచ్యుతరావు, శ్రీనివాసరావు, కె.వీరాచారి, హైమావతి, కిరణ్, అప్పలనాయుడు, రామరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పది లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: మండలంలోని కీసరజోడు సమీపంలో ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నీలకంఠరావు శుక్రవారం తెలిపారు. నిందితుడు పోలీసులను చూసి ద్విచక్ర వాహనంతో పాటు సారాను వదిలేసి పరారయ్యాడని, నిందితుడి కోసం గాలిస్తున్నామని చెప్పారు. సారాతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

హెచ్‌ఎంలపై భారం తగ్గించాలి

గుమ్మలక్ష్మీపురం: నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలపై పనిభారం తగ్గించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.దేవానంద్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో వివిధ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, అయితే వాటికి సంబంధించిన ఎస్టిమేషన్స్, ఖర్చుల విషయంలో ఇంజినీరింగ్ సిబ్బంది సహకారం కూడా చాలా అవసరమన్నారు. విద్యాబోధన సంబంధిత కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు విధులు నిర్వహించాల్సి ఉందని, కావున వారిని పనుల పర్యవేక్షణకు మాత్రమే పరిమితం చేయాలని, వారిపై పని భారం తగ్గించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



మానవహారం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పాలకొండ: మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని, చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, జనాభా మేరకు కార్మికులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ సంజీవి, వై.హరిబాబు, చింతల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల వినతి



వినతిపత్రం అందిస్తున్న ఆశావర్కర్లు

పాలకొండ: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ నాయకులు శుక్రవారం అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్‌కు వినతిపత్రం అందించారు. నాణ్యమైన సెల్ ఫోన్లు అందించాలని, మెడికల్ లీవ్‌లు మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న ఆశావర్కర్ పోస్టులను భర్తీ చేయాలని తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.రమణారావు, శ్రీదేవి, కాంతామని, లక్ష్మీపార్వతి, రాధారాణి, ధనలక్ష్మి, రూపవతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా నిధుల కేటాయింపు

భామిని: ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి నిధుల కేటాయింపులో తేడాలు ఉండవని, ప్రజావసరాల మేరకు పనులు గుర్తించి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎంపీపీ తోట శాంతికుమారి, ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం అన్నారు. ఎంపీపీ అధ్యక్షతన, ఈఓపీఆర్డీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేవలం నలుగురు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. ఇటీవల మంజూరైన రూ.1.30 కోట్లు ఉపాధిహామీ నిధుల కేటాయింపుపై వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు అడిగిన ప్రశ్నకు ఎంపీపీ సమాధానం ఇచ్చారు. ఉపాధి నిధులపై అపోహలు వీడాలని, ఎంపీటీసీల సిఫార్సులతోనే నిధులు కేటాయిస్తామన్నారు.

బాలేరు వైద్యాధికారి డాక్టర్ దీపికారాణి సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎంఈఓ వి.భాస్కరరావు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వం విద్యారంగంలో చేపట్టిన అంశాలను వివరించారు. రెవెన్యూ అధికారులు హాజరుకాలేదు. బాలేరు ఎంపీటీసీలు కొత్తకోట చంద్రశేఖర్, పాలక ఉషారాణి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు: సీఐ



భామిని: రోడ్డు భద్రత నిబంధనలు వివరిస్తున్న ఏఎంవీఐ నవీన్‌కుమార్

పాలకొండ రూరల్: డ్రైవింగ్ లైసెన్సులు లేనివారికి, మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వకూడదని సీఐ మురళీధర్ అన్నారు. అలా ఇచ్చినపుడు ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు వాహన యజమానులు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. విశాఖ, వీరఘట్టం రహదారుల్లో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ద్విచక్రవాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించి వారికి, సదరు వాహన యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అతివేగం, పరిమితికి మించిన ప్రయాణికులతో వచ్చిన వాహనదారులకు, సరైన ధ్రువపత్రాలు లేని వాహనచోదకులకు అపరాధ రుసుం విధించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

- భామిని: మండలంలో బత్తిలి, మనుమకొండ, నల్లరాయిగూడ పాఠశాలల్లో రోడ్డు భద్రతపై శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. పాలకొండ ఏఎంవీఐ జీ నవీన్‌కుమార్, రవాణా శాఖ వైద్యాధికారి డాక్టర్ నారాయణరావు విద్యార్థులకు రోడ్డు భద్రత నిబంధనలను వివరించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమని, ట్రాఫిక్ రూల్స్‌పై కుటుంబ సభ్యులతో పాటు ఇంటి చుట్టుపక్కల ఉన్నవారికి అవగాహన కల్పించాలని సూచించారు. బత్తిలి ఏఎస్సై గురుమూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులకు సంబంధించిన నిర్మాణ వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: మండలంలోని తుమరాడ గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ సింహాచలం, పంచాయతీరాజ్ డీఈ లోకనాథం శుక్రవారం పరిశీలించారు. ఇటీవల ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి గ్రామంలో పర్యటించి నిర్మాణంలో ఉన్న ఆర్‌బీకే, సచివాయలం, వెల్‌నెస్ కేంద్రాన్ని పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేసి భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఆయా పనుల తాజా స్థితిగతులపై ఆరాతీశారు. ఆర్‌బీకే, సచివాలయ భవనాలు పూర్తికావచ్చాయని, విద్యుత్ హైటెన్షన్ వైర్ల కారణంగా వెల్‌నెస్ కేంద్ర నిర్మాణానికి ఏర్పడుతున్న ఇబ్బందులను సర్పంచ్ పి.శోభారాణి అధికారులకు వివరించారు.

నీటమునిగిన పంట పొలాలు



పొలంలో చేరిన వర్షపునీరు

పాలకొండ రూరల్: మండల వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు చేరింది. వీరఘట్టం రహదారిలో వందలాది ఎకరాల్లో వరిచేలు నీటమునిగాయి. వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం ముంపు భూములను పరిశీలించారు. తక్షణమే చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. నీరు బయటకు పంపించి పదును చూసుకొని తగిన మోతాదులో ఎరువులు వేసుకోవాలని ఏఓ ఎన్ని వాహిని సూచించారు.


పులి కదలికలపై అప్రమత్తం



సచివాలయ సిబ్బందికి కరపత్రాలు అందిస్తున్న అటవీశాఖ సిబ్బంది

భామిని: ఏజెన్సీ ప్రాంతంలో పులి కదలికలు బయట పడినందున సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తూరు అటవీశాఖాధికారి కె.కృష్ణారావు, బీటు అధికారి లక్ష్మణమూర్తి శుక్రవారం కోరారు. మండలంలో పెద్దదిమిలి, ఘనసర, బాలేరు గ్రామ సచివాలయాల సిబ్బందిని అప్రమత్తం చేశారు. పులి కనిపిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసే కరపత్రాలు అందించారు. ఈ మేరకు ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. మరోవైపు బత్తిలి ఏఎస్సై గురుమూర్తి సారథ్యంలో పోలీసులు గ్రామాల్లో దండోరాలు వేయించారు.

హుషారుగా వరినాట్లు



కొమరాడ: మండలంలోని గిరిశిఖర గ్రామమైన పూడేస్‌లో మహిళా రైతులు శుక్రవారం వరినాట్లు వేస్తూ కనిపించారు. నాట్లు ఆలస్యం కావడంతో నారు ఏపుగా ఎదిగింది. దీంతో తెగుళ్ల ఉధృతిని నివారించేందుకు రైతులు నారు చివర్లను తుంచి నాట్లు వేశారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేస్తున్నట్లు చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో విజృంభించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి రవికుమార్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని, వండిన ఆహార పదార్థాలపై మూత పెట్టాలని ప్రజలకు సూచించారు. జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు.

ఆటస్థలం ఆక్రమణపై సబ్‌కలెక్టర్ ఆరా..



తెట్టంగి హైస్కూల్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్ కమర్

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానం ఆక్రమణలపై అధికారులు స్పందించారు. హైస్కూల్ మైదానం ఆక్రమణపై ఈ నెల 12న సాక్షిలో ప్రచురితమైన కథనంపై సబ్ కలెక్టర్ నూరల్ కమర్ విచారణ చేపట్టారు. శుక్రవారం హైస్కూల్‌ను సందర్శించి ఆక్రమణలపై ఆరా తీశారు. పాఠశాల పరిసరాల్లో ఉన్న పూరిళ్లను పరిశీలించి తహసీల్దార్ చందక సత్యనారాయణ నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఉన్న ఆక్రమణలు తొలగించి, విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు వీలుగా మైదానాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ 500 మంది గ్రామస్తులు సంతకాలు చేసి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం సబ్ కలెక్టర్ పాఠశాలలో 10వ తరగతి గదిని పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆక్రమణలు తొలగించడంతో పాటు ఇక్కడ ఉన్నవారికి ప్రత్యామ్నాయ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఈఓ గౌరినాయుడు, హెచ్‌ఎం దూసి నాగమణి, ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, సర్పంచ్ అలజంగి విజయమ్మ, వైస్ సర్పంచ్ పొట్నూరు పరిశినాయుడు, సతివాడ చిన్నంనాయుడు, వండాన కృష్ణమూర్తి తదితరులున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఫోరం చైర్మన్ సత్యనారాయణ

కురుపాం: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే ఫోరం లక్ష్యమని, న్యాయమైన పరిష్కారం కోసం విద్యుత్ వినియోగదారులు ఫోరంను ఆశ్రయించవచ్చని ఫోరం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అన్నారు. ఏపీఈపీడీసీఎల్ పార్వతీపురం ఈఈ వి.కిశోర్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించనట్లయితే వినియోగదారులు ఫోరంను ఆశ్రయించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఈఈ ఎం.రాజేంద్రప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉషారాణి, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో డ్రైడే కార్యక్రమం



గుమ్మలక్ష్మీపురంలో బావిని క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గుమ్మలక్ష్మీపురం, సంధిగూడ, జోబగూడ, సీమలగూడ, సెంటర్‌గూడ గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులతో కలిసి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని తాగునీటి పథకాల ట్యాంక్‌లను శుభ్రం చేశారు. అలాగే నేల బావులను క్లోరినేషన్ చేశారు. మురుగునీరు నిలిచే ప్రదేశాల్లో ఏఎల్ఓ మందును చల్లారు. దోమల నివారణకు ప్రతీ శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

నేత్ర సమస్యలపై నిర్లక్ష్యం వహించొద్దు



కంటి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణారావు

పాలకొండ రూరల్: కంటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కృష్ణారావు అన్నారు. మండలంలోని పొట్లి గ్రామంలో శుక్రవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 54 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 11 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. మిగిలిన వారికి అవసరమైన మందులు ఉచితంగా అందించారు.

వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జి.శోభారాణి, పి.దీపిక, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సచివాలయ భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి



గ్రామ సచివాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారి

గరుగుబిల్లి: గ్రామాల్లో చేపట్టిన సచివాలయ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి మహమ్మద్ ఫరూక్ సైపుద్దీన్ అన్నారు. మండలంలోని రావుపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రావుపల్లి, పెద్దూరు గ్రామాల్లో సచివాలయ భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. గ్రామ సచివాలయ భవనాన్ని రూ.40 లక్షలతో, ఆర్‌బీకేలను రూ.21.80 లక్షలతో నిర్మించడం జరిగిందన్నారు. చినగుడబలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చేతులమీదుగ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఐకమత్యంతో పని చేస్తాం..



గుమడ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న పార్టీ కన్వీనర్ జనార్దనరావు

కొమరాడ: మండలంలోని గంగారేగువలసలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కె.బాబూరావు ఆధ్వర్యంలో పార్టీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు గుమడ గ్రామానికి చెందిన పార్టీ నాయకులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ స్థానిక నాయకులలో ఎలాంటి మనస్పర్థలు లేకుండా ఐక్యమత్యంతో పని చేసి 2024లో మరోసారి జగనన్నను సీఎంగా, పాముల పుష్పశ్రీవాణిని ఎమ్మెల్యేగా గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మోహన్, గండి దిలీప్, శివిని పీఏసీఎస్ అధ్యక్షుడు పప్పల గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.